


# టేకిట్ ఈజీ!! - 3





## శ్రీనివాస ఫణికుమార్ డొక్కా

## -9-

# స్పైడర్ మాన్ సంసారం

**ఆదివారం రాత్రి పది**. హాయిగా లుంగీ కట్టుకుని జెట్టీ బనీను వేసుకుని "మీలో ఎవరు కోటీశ్వరుడు" రికార్డింగ్ చూస్తున్నాడు స్పైడర్ మాన్.

మేడమీంచి వాళ్ళ ఆవిడ పిలుపు "ఏవండోయ్, చూసిన టీ.వీ చాలు గానీ ఓ మాట్రండి, ఈ చిన్న దెయ్యం పడుకోట్లేదు."

విసుక్కుంటూ సోఫాలోంచి లేచాడు. కాళ్ళీడ్చుకుంటూ మెట్లెక్కుతున్నాడు.

"వచ్చారా? లేదా?" పైనించి రెండో వార్నింగ్ వచ్చింది.

"అబ్బ వస్తున్నానే, మెట్లెక్కాలా వద్దా?" అన్నాడు పీల గొంతుతో.

"అదేవిటి? అమ్మాయిల్ని కాపాడేప్పుడు రయ్యి రయ్యి మంటూ బిల్డింగులమీంచి ఎగిరేసి, దూకేసి, నానా హడావిడీ చేస్తారు. ఇంట్లో మెట్లెక్కలేరా? పని ఎగ్గొడ్డానికి కాపోతే?" అంది కోపంగా.

మొత్తానికి పైకొచ్చి పక్కెక్కాడు స్పైడర్ మాన్.

"నాన్నా, నాకు నిద్దర్రాట్లేదు, నీ ఖత చెప్పు.." అంది చిన్న దెయ్యం.

"అబ్బ దిక్కుమాలిన కథ, ఎప్పుడూ అదేనా, ఈ సారి హల్క్ కథ చెబుతానే" అన్నాడు బుజ్జగింపుగా.

"నో, నాకు నీ ఖతే కావాలి, నీ ఖతే, నీ ఖతే..." అంటూ అందుకుంది స్మాల్ డెవిల్.

ఇంక తప్పదని మొదలెట్టాడు.

"నాన్న చిన్నప్పుడు ఓ సారేమో, హేపీ బర్త్ డే రోజు, ఒక సాలీడు కరిచింది." అంటూంటే ఆపి

"సాలీడు హేపీ బర్త్డేనా?" అంది చి.దె.

స్పైడర్ మాన్ కి చిరాకేసి "ఏహె, బర్త్ డే నాన్నది, అంటే నాది, సరే విను.." అని మళ్ళీ మొదలెట్టాడు.

"ఓ, సాలీడు నీ బర్త్ డే పార్టీకి వచ్చిందా?" అంది బుగ్గ మీద వేలెట్టుకుని చి.దె.

ఇంక సవరించే ఓపిక లేక "అవునమ్మా, నాన్న సాలీళ్ళనీ, బొజ్జింకల్నీ, బల్లునీ, తొండల్నీ ఇన్వైట్ చేసాడన్నమాట పార్టీకి. అప్పుడు ఓ సాలీడు ముందు కేక్ బైట్ చేసి, ఆనక నన్ను బైట్ చేసి పారిపోయింది. ఆ రోజు రాత్రి నాన్నకి కుంచెం కడుపు నెప్పి వచ్చింది." అంటూంటే

మళ్ళీ అడిగింది "ఓ, నీ బొజ్జలో కూడా బుజ్జి బేబీ వుందా నాన్నా?".

"నువ్వు కథ వినవే తల్లీ, అది బేబీ నొప్పి కాదు. స్పైడర్ బగ్ అన్నమాట. నెక్స్ట్ డే నించీ నాన్న చేతిలోంచి బోల్డన్ని స్పైడర్ వెబ్స్ వచ్చేస్తున్నాయి. నాన్న ఆ వెబ్స్ తో అన్ని బిల్డింగ్సూ క్లైంబ్ చేసేసి, జంప్ చేసేసి, అన్నీ చేసేస్తున్నాడు. ఒకరోజు అలా చేస్తూంటే లాగు చిరిగిపోయింది. ఆ వీక్ లో ఫోర్ లాగులు, టెన్ చొక్కాలు చిరిగిపోయాయి. అప్పుడు తాతగారికి ఖోపం వచ్చి, నన్ను చితక్కొట్టేసారు."

"ఎవరేనా కొడితే నువ్వు పోలీసులకి ఫోను చెయ్యాలి నాన్నా, మా మిస్ లిల్లీ చెప్పింది." అంది అక్కర్లేని ఇన్ ఫర్మేషనిస్తూ.

"నా తల్లే. మా చిన్నప్పుడు అలాంటివేవీ లేవన్నమాట. సరే, అప్పుడు నానమ్మకి ఐడియ వచ్చి, ఒక పేద్ద దుప్పటీ కట్ చేసి, నాకు ఒక బీన్ బేగ్ లాంటి డ్రెస్స్ కుట్టించింది, దానిమీద నేను స్కెచ్ పెన్ తో గీతలు గీసుకుని తొడుక్కున్నానన్నమాట." ఆగాడు.

"మరి నీ మాస్కు?" అంది చి.దె.

"అదా, నేను రోజూ గెంతులేస్తూ బిల్డింగులెక్కి దూకుతూంటే, అందరూ కోతి గాడు, కోతి గాడు అని పిలిచేవారు. తాతగారికి కోపం వచ్చి "నీ మొహం నాకు చూపించకు దరిద్రుడా" అన్నారు. మరి మొహం చూపించకుండా సేం హౌస్ లో వుండలేం కదా. అందుకుని, మళ్ళీ నేనే, నాలుగు కర్చీఫ్ లు కలిపి, ఒక మాస్కు కుట్టించుకున్నానన్నమాట".

"ఓ, కర్చీఫ్ అంటే?" అంది చి.దె.

"నా బొందే, నా బొంద. ఇంక నువ్వు పడుక్కోపోతే పీకి పిసికేస్తాను." అన్నాడు కొంచెం వయలెంట్ గా.

చిన్న దెయ్యం ఓ మాటు బెంగగా చూసి, ఫోను తీసి నెంబరు నొక్కడం మొదలెట్టింది. అమాంతం మీదపడి లాక్కున్నాడు స్పైడర్ మాన్. మరో సెకను ఆలీసం అయ్యుంటే పోలీసులకి ఫోను వెళిపోయేదే.

ఆ ఫోను అవతల గిరాటెట్టి "నువ్వు పడుక్కోవే రాక్షసీ" అన్నాడు దీనంగా.

"నో, నువ్వు నన్ను పేట్ చెయ్యి, నాకు "నీజతగా" పాట పాడు" అంది చి.దె.

వచ్చే ఏడుపుని ఆపుకుంటూ, చి.దె ని జోకొడుతూ "నీజతగా నేనుండాలీ, నీ ఎదలో నేనిండాలీ....నాకు వంట రాదు.." అంటూ అక్షరం ముక్క తప్పకుండా, డైలాగ్స్ తో సహా ఆ పాట పాడి దాన్ని పడుకోపెట్టాడు.

ఇంతలో సెల్ ఫోను లో టెక్స్ట్ వచ్చింది. **"ఏ.టీ.ఎం రాబరీ, అబిడ్స్ సర్కిల్, స్టార్ట్ ఇమీడియెట్లీ.."** అని. వెంటనే ఒక్క గెంతు గెంతి, క్లాజెట్ లోంచి కాస్ట్యూం లాగి ఎక్కించడం మొదలెట్టాడు. బొజ్జ దగ్గిర జిప్పు పట్టలేదు. ఒక్క సారి ఊపిరంతా బైటికొదిలి, రెండు సార్లు కపాల భాతి చేసి, పొట్ట నడ్డి వైపుకి లాగి, అది మళ్ళీ బౌన్స్ అయ్యేలోపు జిప్పు పెట్టేసాడు. సీట్ దగ్గర చిన్న కట్ ఐంది.

"ఒసేయ్ ఓ పిన్నీసు ఇవ్వవే అర్జెంటు" అని రిక్వెస్టు చేసి, పిన్నీసు పెట్టుకుని రెడీ అయ్యాడు.

వాళ్ళావిడ చూసి " ఈ డ్రెస్సు మరీ టైట్ గా ఉంది. ఈ సారి ఆ కిస్తా కాస్త కిందకి కుట్టమనండి. లేకపోతే మరీ నూతిలో మట్టి తీసే వాడిలా ఉన్నారు. ఇంటికి త్వరగా రండి, రేప్పొద్దున మళ్ళీ పెద్దదాన్ని స్కూల్లో దింపాలి". అంది అటుతిరిగి పడుకుంటూ.

"సరే, మాస్కు పెట్టేసుకుంటున్నా" అన్నాడు కిందకి వెడుతూ.

"ఇదిగో, ఓ మాటు ఆ పాలు తోడిపెట్టేసి వెళ్ళండి" అంది ఆవులిస్తూ.

"ఛీ, దిక్కుమాలిన బతుకు.." అనుకుంటూ, మాస్కులోంచి బాధపడుతూ, పాలు తోడిపెట్టి, బైటికొచ్చి, సాలె గూళ్ళు విసిరేస్తూ, ఎగిరిపోయాడు స్పైడర్ మాన్.

సెల్ టవర్ మీద దూకాడు. పంజాగుట్ట సర్కిల్ లో రోడ్డుమీదే రెండువేల కార్లు పార్కు చేసి వున్నాయి. ఒక ఫ్లై ఓవర్ మెల్లిగా ఊగుతూ పడిపోడానికి సిద్ధంగా ఉంది. రెండు సిమెంటు దిమ్మలు విరిగి కిందవెళ్ళే ఆటోమీద, కారు మీద పడ్డాయి. వాటిలో మనుషులు వోక్కాయ పప్పైపోయారు. ఎటునించో వస్తున్న టూ వీలర్, అమాంతం మేన్ హోల్ లో పడి మాయమైపోయింది. నలుగురు లోన్ రికవరీ ఆఫీసర్లు ఎనిమిది మందిని బస్సుల్లోంచి బైటికి లాగి, వెంటాడి మరీ కత్తులతో పొడుస్తున్నారు.

“ఇడ్లీస్” రెస్టారెంటులో కొత్త ఇడ్లీ విడుదలైన సందర్భంగా పార్కింగ్ లేక, అందరూ కుక్కడపల్లి దగ్గర పార్క్ చేసి, నడుచుకుని వస్తున్నారు. రెండు మహిళా సంఘాలవారు ప్రభుత్వ “కురచ స్కర్టుల నియమావళి” కి నిరసనగా ధర్నా చేస్తున్నారు. జపాన్ ప్రైమినిస్టర్ నించి, పంచాయితీ ప్రెసిడెంట్ దాకా అందరినీ దిగిపొమ్మంటున్నారు. అక్కడ టీ.వీ కవరేజ్ కోసం నలభై రెండు వేన్ లు, ఒకదానిమీద ఒకటి పార్క్ చేసారు. అంతా ఎప్పటిలాగే లాగే నార్మల్ గానే ఉంది.

ఒక్క సారి డౌటొచ్చింది. ఇక్కడంతా రోజులాగే వుంది, ఏ.టీ.ఎం రాబరీ ఎక్కడా కనపట్టంలేదు, అనుకుని, ఎందుకైనా మంచిదని ఇంకోసారి సెల్ ఫోన్ లో టెక్స్ట్ చూసి, నాలిక్కరుచుకుని, "వార్నీ, నేవెళ్ళాల్సింది అబిడ్స్ సర్కిల్ కి.." అనుకుని, అట్నించి అటే ఎగిరిపోయాడు అబిడ్స్ కి.

అబిడ్స్ సర్కిల్ లో ఏటీఎం దగ్గర దిగేసరికి అది ఖాళీ. బైట సెక్యూరిటీ గార్డు అప్పుడే స్పృహలోకి వస్తున్నాడు. స్పైడర్ మేన్ వాడి ముందుకి దూకాడు.

వాడు ఆవులిస్తూ లేచి, స్పైడర్ మేన్ ని చూసి, చికాగ్గా మొహం పెట్టి "ఏం జరిగింది?" అన్నాడు.

స్పైడర్ మేన్ బుంగమూతెట్టి "అది నేను కదా అడగాలి..నేనొప్పుకోను" అన్నాడు.

"సరే, నువ్వే అడుగు" అన్నాడు గార్డు.

"ఏం జరిగింది ఇక్కడ?" అని అడిగాడు స్పైడర్ మేన్.

"నాకు తెలవదు, నువ్వే చెప్పు" అన్నాడు గార్డు కూల్ గా.

ఇంక లాభంలేదని "అంటే నాకు టెక్స్ట్ వచ్చింది..ఇక్కడేదో రాబరీ అని.." అంటూ నీళ్ళు నమిలాడు.

"ఓ అదా, నిన్న నైట్ బేక్ టు బేక్ ఫైవ్ సిన్మాలు జూసా. అందుకని టూ అవర్స్ నేప్ తీసుకున్నా. ఇంతలోకి రాబర్స్ వచ్చి తీసుకుపోయుంటరు పైసలు. లాస్ట్ వీక్ కూడా ఇలానే ఐంది." అన్నాడు వాడు చాలా కేజువల్ గా.

"మరిప్పుడెలా?" ఆందోళనగా అడిగాడు స్పైడర్ మేన్.

"ఏంపర్లేదు. వచ్చే వారం సేం డే మళ్ళీ అవుతుంది. అప్పుడు కొంచెం ముందురా, వాళ్ళని పట్టుకో.." అన్నాడు గార్డు.

"ఒరేయ్, క్రితం వారం రాబరీకే కేసుకే నన్ను చెడ్డ తిట్లు తిట్టాడు కమీషనరు. ఈ సారి వాళ్ళని పట్టుకోపోతే నా ఉజ్జోగం పోద్దిరా. ఏదైనా ఐడియా చెప్పరా" అని బతిమిలాడాడు.

"అంటే, వాళ్ళు రాబరీ తర్వాత రుబీ రెస్టారాంట్ లో బిరియానీ తింటారు, సెంటిమెంటు. అక్కడ ట్రై చెయ్యి" అనేసి మళ్ళీ నిద్రలోకెళ్ళిపోయాడు గార్డు.

కట్ చేస్తే రుబీ రెస్టారెంటు.

"అదేం కుదరదు. మొత్తం డబ్బు మూడు వాటాలెయ్యాల్సిందే" అన్నాడు రాబర్1.

అన్ ఎక్స్పెక్టెడ్ గా ఒక చాకు క్లోజప్. ఒక గొంతు కట్టయ్యి పోయింది. రాబర్2 ఇప్పుడు మర్డరర్ 1 అయిపోయాడు. ఎదురుగా రాబర్3 బిగుసుకుపోయి చూస్తున్నాడు.

"ఇప్పుడు రెండేవాటాలు..ఇ హి హి.." అంటూ సిగిరెట్ పేకెట్ కోసం జేబులో వెతుకుతున్నాడు.

"ఢాం". వాడి పుచ్చె లేచిపోయింది. రాబర్3 కాస్తా మర్డరర్2 అయిపోయాడు.

"ఇప్పుడు వాటాలే లేవు, అందుకే సినిమాలు చూడాలి. ఎట్ లీస్ట్ క్షణ క్షణమన్నా చూడాలి, ఇలాంటప్పుడు చాలా యూజ్ఫుల్.." అన్నాడు తుపాకీ జేబులో పెట్టుకుంటూ.

వెంటనే స్పైడర్ మేన్ వచ్చి సాలెతాళ్ళతో వాణ్ణి అల్లేసాడు డబ్బుతో సహా. "నీ ఎంకమ్మా, నువ్వెవడివిరా?" అన్నాడు రాబర్3/మర్డరర్2.

"మరదే కామెడీ అంటే..ఎప్పుడూ తెలుగు సినిమాలే కాదు, అప్పుడప్పుడూ ఇంగ్లీష్ సినిమాలు కూడా చూడాలి బాబాయ్.." అనేసి వాణ్ణి తీసికెళ్ళి కమీషనర్ ఇంటిముందు పడేసి బెల్లు కొట్టాడు.

కళ్ళు నులువుకుంటూ బైటికొచ్చాడు కమీషనర్. "ఏందయ్యా, ఇంత లేటుగానా రావడం. డబ్బంతా ఉందా?"

"నేను లెక్కెట్టలేద్సార్, ఉండే ఉంటుంది సార్" అన్నాడు స్పైడర్ మేన్ వినయంగా.

"సర్లే, ఆడి సంగతి మావాళ్ళు చూస్తారు గానీ, నువ్వింక ఇంటికెళ్ళు. ఇదిగో ఈ పది రూపాయలు తీసుకుని చాయ్ తాగు".

"యెస్సార్, సార్ ఫోర్ మంత్స్ నించీ సాలరీ రావట్లేదు సార్.." అన్నాడు దీనంగా.

"ఓ అదా, ఒరిస్సా కేడర్ స్పైడర్ మేన్ ట్రెయినీలని రిక్రూట్ చేద్దామని మినిష్టర్ గారు చెబుతున్నారు. ఆళ్ళని ట్రై చేస్తున్నాం. సర్లే, నే చూస్తాలే..".

"అది కాద్సార్, పెద్ద పిల్లకి టెక్స్ట్ బుక్స్, చిన్న పిల్లకి లెగోస్ కొనాలి సార్, అందుకనే.." అన్నాడు రెండో సారి దీనంగా.

"నే జూస్తాలే, నో వర్రీస్, ఇంద ఈ వంద ఉంచు ఖర్చులకి..బయల్దేరు" అనేసి, ఆల్మోస్ట్ గెంటేసి, తలుపేసేసారు.

దీనంగా గేటు బైటికొచ్చాడు స్పైడర్ మేన్. ఎగిరే ఇంటరెస్ట్ లేక కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి బయల్దేరాడు. అమాంతం అతన్ని ఎవరో వలవేసి పట్టేసారు.

ఐదునిమిషాల్లో అతను టీ.వీ 999 వారి ఎక్స్క్లూజివ్ బబ్లూ గాడి ముఖాముఖీలో వున్నాడు.

"మీరంతా ఎంతకాలంగానో ఎదురుచూస్తున్న స్పైడర్మేన్ తో స్ట్రెయిట్ టాక్ కి స్వాగతం."

"నమస్తే స్పైడర్ మేన్ గారూ..."

"నమస్తే సార్.."

"మీరు అవుటాఫ్ షేప్ ఐనట్టున్నారు?"

"అంటే, ఇండస్ట్రీలో థర్టీ ఇయర్స్ ఎక్స్పీరియెన్స్ కదా. ఇప్పుడిప్పుడే కాస్త టైరింగ్ గా అనిపిస్తోందన్నమాట."

"అసలు స్పైడర్లు మీ సామాజిక వర్గం వాళ్ళనే ఎందుకు కరుస్తున్నాయంటారు? ఇది మీ కుట్రా?"

"అలాంటిదేమీ లేదండి. సాలీడుతో ఎవరన్నా కుట్టించుకోవచ్చు. కాపోతే చాలామంది పోతారు. బతికితే స్పైడర్ మేన్ అవుతారు."

"మీరు మీ కెరీర్ లో అందమైన అమ్మాయిలనే ఎక్కువ సేవ్ చేసినట్లు రికార్డ్స్ చెబుతున్నాయి. మీలో ఒక లోఫర్ / ఒక ఈడియట్ దాగివున్నాడా?"

"లేదండి. నేను 3 ఏళ్ళ పిల్లల్నించీ, ముసలివాళ్ళదాకా అందర్నీ సేవ్ చేసాను"

"మీకు ప్రభుత్వం సరిగ్గా జీతాలు కూడా ఇవ్వట్లేదని విన్నాను"

"ఔన్సార్, పే చెక్ వచ్చి నాలుగు నెలలైంది సార్.."

"ప్రభుత్వం మిమ్మల్ని ఇలా ఎందుకు నిర్లక్షయం చేస్తోంది?"

"తెలీద్సార్. కానీ మాకు గడవటం కష్టమైపోతోంది సార్."

"మీరు ప్రభుత్వం నించి ఏమి ఆశిస్తున్నారు?"

"అంటే, అమరావతిలో ఆరెకరాలిస్తే స్పైడర్ అకాడమీ పెట్టాలనుంది సార్. అప్పుడు మనం స్పైడర్ మేన్ లనీ, స్పైడర్ వుమెన్ లని కూడా తయారు చేసి, వేరే రాష్ట్రాల స్పైడర్ మేన్ లను డౌన్లోడ్ చేసుకోకుండా తెలుగు వాళ్ళనే ఉపయోగించుకోవచ్చు సార్."

"మీరెప్పుడైనా అద్దంలో మీ మొహం చూసుకున్నారా? మీరు స్పైడర్ మేన్ రోల్ కి సరిపోతానని ఎలా అనుకున్నారు?"

"రేయ్., స్పైడర్ మేన్ కి మొహం కన్నా మాస్కు ముఖ్యం రా, అది సూటైతే చాలు. ఇంకోసారి ఇంటర్వ్యూ అన్నావంటే నిన్ను ఛంపేస్తాను.." అనేసి లేచి ఎగిరిపోయాడు స్పైడర్ మేన్.

ఇంటికొచ్చేసరికి తెల్లారిపోయింది. కాస్త కాఫీ చుక్క తాగి, పిల్లని స్కూల్లో దింపేసి వచ్చి, "హాయిగా ఏ కంప్యూటర్ చదువో చదువుకున్నాను కాదు.." అంటూ కాస్టూం ఇప్పేసి, లుంగీ కట్టుకుని పేపరు తీసాడు.

**"నీడ్ సెక్యూరిటీ ఎట్ వినాయక చవితి పందిరి – టాంక్ బండ్ – స్టార్ట్ ఇమ్మీడియెట్లీ.."** ఫోన్లో మళ్ళీ టెక్స్ట్ వచ్చింది !!

COMMENTS